కథ

# బంతి

## - పురాణపండ రంగనాథ్

అది చిన్న ఇల్లు. ఇంటి వరండా మీది కర్ర కుర్చీలో ఆ ముసలాయన కూర్చుని ఉన్నాడు. ముఖం పై లోతైన, దట్టమైన ముడుతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కళ్లజోడు సవరించుకొంటూ ఆయన బయటి వీధిలోని హడావుడిని, కోలాహల దృశ్యాన్ని చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడు.

ఎవరైనా ఆయనను తదేకంగా చూస్తే ఆయన సంతృప్తి జీవనం గడుపుతున్నాడనిపిస్తుంది. ఈ ప్రపంచం పట్ల నిర్లిప్తతను పెంచుకొన్న ప్రశాంతత ఆయన చూపుల్లో కనిపిస్తుంది. భౌతికంగా ఆయన్ని చూసిన వారెవరూ ఆయనలో విషాదం గూడుకట్టుకొని ఉందని అనుకోరు. కాని అస్థిగతమైన దిగులుకు ఆయన సాకార స్వరూపం అని ఎవరూ వూహించలేరు. ఇది నిజం.

ఏడాదిక్రితం భార్య మరణించినప్పటినుంచి ఆ ముసలాయన దిగులుగానే ఉంటున్నాడు. ఒంటరితనం సుడిగుండం వలె ఆయన్ని తనలోకి లాగేసుకొని బాధిస్తోంది.

* * *

వివాహం అయిన నాటి నుంచి కన్నుమూసే వరకు భార్య ఆయనకు తోడు నీడగా గడిపింది. ఆనంద విషాదాలని, సుఖ దుఃఖాలని పంచుకొంటూ యిద్దరూ వయోవృద్ధులయ్యారు. వయస్సు కాని, మనోభావాలు కాని, విధికాని వారిద్దరి ప్రేమాను రాగాలను ఇసుమంతయినా తగ్గించలేకపోయాయి. కాని మృత్యువు వారి మధ్య ప్రవేశించి, వియోగాన్ని కల్పించింది. ఆమెను ఆయన నుంచి దూరం చేసేసింది. ఆమె అస్తికలను గంగా నదిలో కలిపి వచ్చినప్పటి నుంచి ఆయనకు జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి. జంటగా అనుభవించిన ఆనంద సరాగాలు యిపుడు ఒంటరితనపు ఏక్‌తార పై విషాద రాగం వినిపిస్తున్నాయి. ఆమె మరణం ఆయనకు కల్పించిన అగాధాన్ని ఎవ్వరూ పూరించలేరు.

పెద్దకొడుకు పెళ్లయి పట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు. సెలవులకు భార్యాపిల్లలతో వచ్చి చూసి వెళ్లాడు. ఆ నాలుగురోజులు పెద్దకొడుకు సంసారంతో యిల్లు కళ కళలాడుతూ ఉంది. మనవలతో కబుర్లు చెప్తూ వాళ్లని ఆడిస్తూ ఆయన తన ఒంటరితనం నుంచి తాత్కాలికంగా విముక్తిని పొందగలిగాడు. వాళ్లు వెళ్లిపోయాక ముసలాయన ఎంతో వెలితిని అనుభవిస్తూనే ఉన్నాడు.

చిన్నకోడలు జయంతి మంచిదే. ఆయన్ని బాగానే చూస్తుంది. కాని ఆమెకు తన సొంత జీవితం ఉంది..ఆమెకు యింటి పనులు, భర్త పనులున్నాయి పైగా కొత్తగా కాపురం అంచేత ముసలాయన కోరుకున్నంతగా ఆమె ఆయనకు వూరట కలిగించేటంత సేపు తోడుగా ఉండలేదు.

ఉదయం టీ యిచ్చినప్పుడు, మధ్యాహ్నం భోజనం దగ్గర, సాయంత్రం టిఫిన్ చేసినపుడు ఇలా వీలైనప్పుడల్లా ఆమె ఆయనకు కొంత కాలక్షేపం కలిగిస్తోనే ఉంది. అయినా ఆయనకు తృప్తి ఉండడంలేదని ఆమెకు తెలుసు. అందుకే ఒక సారి అంది,

"మావయ్యా మీరు బావగారి దగ్గరకు వెళితే అక్కడ పిల్లలతో కొంత కాలక్షేపం అయి మీకు తృప్తిగా, ఆనందంగా గడుస్తుందేమో. వెళ్లరాదూ."

"వెళ్లనమ్మా కారణం వాళ్లు నన్ను సరిగా చూడరని కాదమ్మా ఇది నేను కట్టుకొన్న ఇల్లు. ఇక్కడే నా జీవితం వెళ్లిపోవాలి. కాని నాతో మాట్లాడడానికి, కబుర్లు చెప్పడానికి ఎవరైనా ఉంటే..." అని ముసలాయన తనలో తాను గొణుక్కొన్నట్లు అని వూరుకొన్నాడు.

చిన్నకోడలు కడుపున పిల్లో... పిల్లాడో పుడితే వాళ్లతో ఆడుకొంటూ, కబుర్లాడుకొంటూ కాలం వెళ్లబుచ్చు వచ్చునన్నది ముసలాయన ఆంతర్యం. కాని జయంతి, మొగుడు మరో రెండేళ్ల వరకూ పిల్లలు వద్దనుకొన్నారు. " పరిమిత సంతానం, ఆలస్య సంతానం" యీ యుగపు యువతరం ఆదర్శాలు కదా అని ముసలాయన అనుకొన్నాడు. అందుకేఎవర్నీ యేమీ అనకుండా తన దుఃఖాన్ని, లోటును తానే దిగమింగుకొని ఆయన కాలం వెళ్లబుచ్చుతున్నాడు.

జయంతి నిస్సహాయంగానే ఆయనకు సేవలు చేస్తోంది.

* * *

ముసలాయన భారత, రామాయణాల పారాయణంతో కొంత సేపు గడుపుతాడు. దగ్గరలో ఉన్న లైబ్రరీకి వెళ్లి పేపరు తిరగవేసి మరి కొంత సేపు గడుపుతాడు.కొంత దూరం నడిచి కొంత సమయాన్ని గడుపుతాడు.ఇవన్నీ యాంత్రికంగా జరిగిపోతున్నాయి తప్ప వాటిలో జవం, జీవం, ప్రతిస్పందన లేవు. అవి యాంత్రిక దినచర్యలై, క్రమంగా అవి ఆయనకీ తోడుగా నిలవలేకపోయాయి. ఇరుగు పొరుగు వారితో బాతాఖానీ కూడా క్రమంగా నిర్జీవ సంభాషణా క్రమంగా మారిపోయింది. ప్రారంభంలో ఆయనతో వినయంగా సంభాషిస్తూ వచ్చిన వారురోజులు గడిచేకొద్దీ ఆయన పట్ల తిరస్కార భావాన్ని ప్రదర్శిస్తూండడాన్ని ఆయన గమనించాడు. ఈ ఏడాదికాలంలోనే ఆయన, జీవితంలోని ఒంటరితనపు అగాధం ఎంత లోతైనదో, ఎంత బాధకరమో అనుభూతికి తెచ్చుకొన్నాడు. తనతో సరదాగా, ప్రేమగా, ఆత్మీయంగా మాట్లాడే వారికోసం ఆయన ఆరాటం.

* * *

ఇవాళ కూడా అలా ఆరాటంగా ఆలోచిస్తూనే ఆయన పరిధిలోని దృశ్యాల్ని చూస్తున్నాడు. హఠాత్తుగా ఆయన వంటరితనాన్ని భంగపరుస్తూ "తాతయ్యా" అంటూ ఎనిమిదేళ్ల కుర్రాడు ఆయన దగ్గరకువచ్చాడు. ముసలాయన ఆత్రంగా కళ్లజోడు సవరించుకొని పిల్లవాడివైపు చూశాడు.

కుర్రాడు నున్నగా, హుషారుగా ఉన్నాడు. నిక్కరు, చొక్కా వేసుకొని ఉన్నాడు. కుర్రాడి చలాకీచూపుల్ని, చూసి ముసలాయన "హలో, నీపేరేవిటి?" అని పలకరించాడు.

"నా పేరు కిరణ్, మా నాన్నగారి పేరు సుబ్బారావు. తాలూకా ఆఫీసులో గుమస్తా. వీధి చివర మా యిల్లు," అన్నాడు ఆ కుర్రాడు చనువుగా.

"భలే, చురుకైనవాడివే. రెండో ప్రశ్న వేయక్కరలేకుండా పూర్తి వివరాలు చెప్పావ్ కూర్చో" అని ముసలాయనతన ఎదురుగా ఉన్న కర్ర స్టూల్ చూపించాడు. ఆ కుర్రవాడు "వుఫ్, వుఫ్" అని స్టూల్ మీది దుమ్ము వూది కూర్చున్నాడు.

'మేం ఈ వీధిలో ఆ యింటికి వచ్చి పది రోజులే అయింది. ఒక్కొక్క యింటి వాళ్లనే పరిచయం చేసుకొంటున్నాను. ఇవాళ మీ యింటికి వచ్చాను" - అని కిరణ్ అన్నాడు. వాడు అలా మాట్లాడుతూ కిటికీలోంచి, వీధి గుమ్మంలోంచి లోపలకు చూస్తున్నాడు.

"ఇంక ఎవరి యిళ్లకూ వెళ్లకు నీకు తీరిక ఉన్నప్పుడల్లా మా యింటికే నా దగ్గరకే రావాలి"- అని ముసలాయన తన సైను బనీను జేబులోంచి పిప్పరమెంట్ బిళ్లల ప్యాకెట్ తీసి అతడికి యిచ్చాడు.

కిరణ్ ఒక పిప్పర్‌మెంట్ తీసుకొని నోటిలో వేసుకొని చప్పరించి "స్స్"అని అభినయించి, "తాతయ్యా, ఈ వూరి చెరువు ఈత పందెంలో నేను సగం వరకు ఈదాను"- అన్నాడు కిరణ్ చెప్తున్న మాటలు తన చిన్న నాటి ఆటల్ని, ఈత పోటీల్ని ముసలాయనకు గుర్తు తెస్తున్నాయి. అంతే- వెంటనే అందుకొని "అబ్బాయి, కిరణ్, నేనూ అంతే. నా చిన్నప్పుడు ఈ చెరువుని తెగ ఈదేవాడిని.ఒకసారి ఆయాసం వచ్చి మునిగిపోబోయాను. ఎవరో పైకి లాగారో, నేనే పైకి వచ్చేశానో తెలియదు.యిప్పుడు గుర్తులేదు" అని ఆ జ్ఞాపకాల దృశ్యాల్ని వూహించుకొని తృప్తి పడసాగాడు ముసలాయన. కిరణ్ రెండవ పిప్పరమెంట్ నోటిలో వేసుకొని మరల యింటిలోపలికి చూశాడు. అక్కడ జయంతి వాళ్ల మాటలు వింటున్నట్లు కనిపించింది.

ఇవేమీ పట్టించుకోని ముసలాయన తన చిన్ననాటి కోతి కొమ్మచ్చి ఆటలు, వుప్పు ఆటలు అట్ల తద్దికి ఆడపిల్లల్ని ఏడిపించడం వరకు ఎన్నో కబుర్లు చెప్పాడు.

" చీకటి పడింది తాతా... నే వెళ్తా" అని కిరణ్ లేచే సరికి ముసలాయన ఉలిక్కి పడ్డాడు. ఒంటరి తనం మరల ఆయన మనస్సుని గ్రహణ ఛాయలా ఆవరించింది. "ఔనౌను, నువ్వు వెళ్లాలి కద. ఆలస్యం చేస్తే మీ అమ్మతిడుతుంది. రేపు యిటు రానివ్వదు." అన్నాడు ముసలాయన. కిరణ్ అప్పటికే లేచాడు.

"రేపు వస్తాను తాతయ్యా" - అన్నాడు.

"రా, తప్పకుండా రా, సుమా, మరచిపోకు. రేపు వేరే తాయిలం పెడతాను"- ముసలాయన మాటలు వినిపిస్తూనే ఉన్నాయి. కిరణ్ వెళ్లిపోయాడు.



నెలాఖరు. తన ఖర్చులకై యిచ్చిన డబ్బులు అయిపోయాయి. కిరణ్‌కి ఏదైనా కొని పెట్టాలంటే కోడల్ని డబ్బులు అడగాలి. ఏం చెప్పాలో తోచక ఆలోచన చేసి "అది సస్పెన్స్ రా, రేపు వస్తే నీకే తెలుస్తుంది. తినబోతూ రుచి అడక్కూడదురా. వెళ్లు"- అని ముసలాయన వాణ్ణి భుజం నిమిరి పంపించేశాడు.

ఆ రాత్రి భోజనాలయాక కోడల్ని డబ్బులు అడగాలని ముసలాయన తటపటాయిస్తుండగా ఆమె ఆయన దగ్గరకు వచ్చి "మావయ్యా మీకా కిరణ్‌తో కాలక్షేపం బాగానే అవుతోంది కద" అని అడిగింది. ముసలాయన నవ్వుతూ, "ఔనమ్మా" అని యింకా ఏదో అడిగే ప్రయత్నం చేయబోయాడు.

జయంతి ఆయనకు అవకాశం యివ్వక "రేపు వాడికి యివి పెట్టండి"- మిల్క్ బిస్కెట్ పాకెట్ యిచ్చి ఆయన మారు మాటకు ఎదురు చూడకుండానే వెళ్లిపోయింది.

* * *

వారం రోజులు గడిచాయి. కిరణ్ క్రమం తప్పకుండా ముసలాయన దగ్గరకు వచ్చి కబుర్లు చెప్పి వెళ్తున్నాడు. ఒక రోజున యిద్దరూ ఆంజనేయ స్వామి గుడికి కూడా వెళ్లి వచ్చారు.

ఆ మరునాడు సకాలానికి కిరణ్ రాలేదు. "అదిగో వస్తాడు, ఇదిగో వస్తాడు" అని ముసలాయన ఎదురు చూసి నిరాశ పడ్డాడు. కిరణ్ రాలేదు. ఆ మరునాడు కూడా కిరణ్ రాలేదు. మూడవరోజున కిరణ్ రాకకై ఎదురు చూసి నిరాశ పడిన ముసలాయన లోపలకు వచ్చేశాడు. జయంతి గదిలోంచి నెమ్మదిగా మాటలు వినపడుతున్నాయి. ముసలాయన జాగ్రత్తగా వినసాడు. కిరణ్‌తో జయంతి మాట్లాడుతోంది. ఆ మాటలు ఇవి,

"ఒరే, నువ్వు వస్తూండాలిరా. మానద్దు ప్లీజ్," జయంతి కిరణ్‌ని బ్రతిమిలాడుతోంది.

"ఎలా రానండి?" కిరణ్ యిబ్బందిగా అంటున్నాడు.

"నువ్వు రాకపోతే తాతగారు డీలా పడిపోతారు. బాధపడతారు." అంది జయంతి.

"రేపు నాకు స్కూలు తెరుస్తారు" కిరణ్ రాలేనన్నట్లు అంటున్నాడు.

"స్కూలు అయిపోయాక రా రా. వచ్చి తీరాలి. ఇన్నాళ్లూ నీకు రోజూ రెండు రూపాయిలే యిస్తున్నాను. రేపట్నుంచి అయిదు రూపాయలు యిస్తాను. రా కిరణ్, నా మాట విను. నీతో కబుర్లు చెపుతోంటే తాతయ్య గారికి ఎంతో వుత్సాహంగా ఉంటోందిరా." జయంతి వాడిని సమాధానపరచాలని అంటోంది.

"నీకు తెలియదు ఆంటీ. బోలెడు హోమ్ వర్క్ ఉంటుంది. పైగా స్కూల్లో గేమ్సు ఉంటాయి. నేను ఆడుకోవాలి. ఆంటీ, నువ్విచ్చిన డబ్బుతో బాల్ కొనుక్కుని లాభం ఏమిటి? ఆ ముసలాయన చెప్పే కబుర్లు వినడం సరదా అనుకొంటున్నావా ఆంటీ. అయినా నువ్వు చెప్పావని, ఫుట్‌బాల్ కొనుక్కునేందుకు డబ్బు లిచ్చావ్ అని యిన్నాళ్లూ వచ్చి అయిష్టంగానే ఆయన కబుర్లు విన్నాను".

"కిరణ్" జయంతికి నోరు పెగల్లేదు.

"నా వల్ల కాదు అంటీ" అని కిరణ్ వెనక్కు చూడకుండా పెరటి దోవన తుర్రు మన్నాడు.

"కిరణ్"- జయంతి వాడిని నిలవరించలేకపోయింది.

"ఎందుకమ్మా వృధా ప్రయాస"- అన్న మావగారి మాటలు జయంతిని తలదించుకొనేటట్లు చేశాయి.

ముసలాయన కుర్చీలో కూలబడ్డాడు. ముసలితనం, ఒంటరితనం ఆయన భుజాలపై, మనసుపై చల్లటి ఉక్కు గుళ్లవలె బరువుగా వున్నాయి. ముసలాయన కళ్ళ వెంట నీళ్ళు నిశ్శబ్దంగా కారుతున్నాయి - ఒంటరితనం ప్రవిస్తున్న జ్ఞాపకాల నదిలా! ❒

* * *

మరునాడు అదే సమయానికి మరల వచ్చాడు. "తాతయ్యా" అని పలకరించి కూర్చున్నాడు. "తాతాయ్యా - గోదావరి వరద వచ్చినప్పుడు నువ్వు బలే సాహసాలు చేసావట అవి చెప్పవూ" - అని అడిగాడు.

ముసలాయన వాడికి కారంబూంది పొట్లం యిచ్చి "ఎవరు చెప్పార్రా" అని అడిగాడు.

"కరణం గారబ్బాయి చెప్పాడు. వాడికి వాళ్ల నాన్న చెప్పారట"- అని కిరణ్ బూంది కొంచెం నోటిలో పోసుకొని కర కర నములుతూ వినసాగాడు.

"నాకు నువ్వు నచ్చావురా, చెప్పున్నంత సేపూ బుద్ధిగా వింటున్నావ్." అని ముసలాయన తన చిన్నప్పుడు,వయసులో ఉండగానూ, గోదావరి వరదలు వచ్చినప్పుడు ఏవేం జరిగాయో కథలుగా చెప్పాడు. కబుర్లు పూర్తి అయే సరికి కారం బూంది అయిపోయింది. కిరణ్‌లేచాడు.

"రేపు వస్తావు కదరా" ముసలాయన ఆత్రంగా అడిగాడు.

"వస్తాను. ఏం పెడతావ్?" కిరణ్ అడిగాడు. ముసలాయన యిబ్బంది పడ్డాడు.